News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :165 | ఖమ్మం | గురువారం, జూలై 23, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# అట్టుడికిన తెలంగాణం

## కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

### లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం

గాంధీభవన్ ముట్టడికి బీజేపీ నేతల దూకుడు

ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత

రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు

నగరంలో పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతల అరెస్ట్

బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి

రామచంద్రరావు, ఎమ్మెల్యే రాకేశ్‌ల ముందస్తు అరెస్ట్

కరీంనగర్‌లో బండి కార్యాలయంపై దాడికి యత్నం

**హైదరాబాద్లోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీగా మోహరించి ఇరు వర్గాలను చెదరగొట్టారు.**




కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా మిగతా 2లో..

అక్రమాలకు అడ్డాగా

# దేశ వ్యవస్థ

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే

పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

ఒక్క కేసులో కూడా దోషులను తేల్చలేదు

మీడియా సమావేశంలో రాహుల్ డిమాండ్

కేంద్రానికి రాహుల్ మూడు డిమాండ్లు

గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వివరాలు 2లో..



## మా సమయం వృథా చేయొద్దు

విద్యార్థుల నిరసనపై విచారించలేం

వీడియోలు చూసే సమయం లేదు

పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం

జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' నిరసన సందర్భంగా పోలీసుల చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశాన్ని ప్రస్తావించగా, "మా సమయం వృథా చేయొద్దు" అంటూ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా వివరాలు 2లో..

## విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు

- రాజకీయ ప్రయోజనాల కోసం చూడొద్దు
- యూపీఏ హయాంలో ఎన్నో పేపర్లు లీకులు
- బంగాల్, కర్ణాటకలోనూ లీకైన ప్రశ్నపత్రాలు
- నీట్‌పై పార్లమెంటులో మేం చర్చకు సిద్ధం
- కేంద్ర మంత్రి జేపీ నడ్డా కీలక ప్రకటన

నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పేపర్ లీక్‌తో సంబంధమున్న అన్ని అంశాలపై సమగ్ర చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విపక్షాలు అడిగే ప్రశ్నలకు వివరాలు 2లో..

# నిరసన తెలిపితే పాశవిక దాడులా?

### రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందింది

- రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం
- నిందితులను శిక్షించకుండా విద్యార్థులపై దాడులా?
- కేటీఆర్ బినామీ సంస్థపై బీజేపీకి ఎందుకంత ప్రేమ?
- నరేంద్ర, ధర్మేంద్ర ఇద్దరూ దేశాన్ని దోచుకుంటున్నారు
- కొడంగల్ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ

నీట్ పేపర్ లీక్ పై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవిక దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి, పోలీసుల పాశవిక దాడులపై కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి నాయకత్వంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ తో బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మార్చిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను వివరాలు 2లో..

## నీట్ పరీక్ష అవకతవకలపై నిరసన

జూలై 24న విద్యాసంస్థల బంద్!

దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన నీట్ పరీక్ష అవకతవకలు, వరుస పేపర్ లీకేజీల వ్యవహారంపై విద్యార్థి లోకం ఆగ్రహంతో రగిలిపోతోంది. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పదే పదే లోపాలపై విద్యార్థి సంఘాలు సమరశంఖం పూరించాయి. పరీక్షల నిర్వహణలో పూర్తిగా వివరాలు 2లో..

# అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు

- టెహ్రాన్‌పై విరుచుకుపడుతున్న అమెరికా
- కువైట్, జోర్డాన్ లపై ఇరాన్ ప్రతిదాడులు
- దాడులతో అట్టుడుకుతున్న పశ్చిమాసియా
- ఇరాన్ పికాక్స్ అణు స్థావరాన్ని పేల్చేస్తాం
- పర్వత సముదాయాన్ని టార్గెట్ చేస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన
- సౌదీతో అమెరికా అణు ఒప్పందం!?
- అమెరికా సాయంతో యురేనియం శుద్ధి
- అణు సహకార ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్
- అణ్వాయుధాలను తయారీకి అవకాశం?

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ దేశాల మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదు. ఇరాన్ లక్ష్యంగా అమెరికా వైమానిక దాడులను కొనసాగిస్తుండగా, ఇరాన్ సైతం తన ప్రత్యర్థులు, అమెరికా మిత్రదేశాలపై ప్రతీకార దాడులు చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌తో శాంతి చర్చలు జరిపే ఆలోచన లేదని అమెరికా అధ్యక్షుడు



## సంస్కరణలకు ప్రజల సంక్షేమమే ముఖ్యం

పౌరుల అవసరాలకనుగుణంగా సంస్కరణలు

సంస్కరణలతోనే దేశంలో నిజమైన మార్పు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు

వికసిత్ భారత్ లక్ష్యాలపై ప్రధాని మోదీ సమీక్ష

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్‌లో గల తన అధికారిక నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. విక్సిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సామాజిక సంక్షేమం, యువత, వివరాలు 2లో..



# అక్రమార్జన..

## ముత్యం వెంకటరమణ అరెస్ట్

ట్రాన్స్‌కో డీఈ ముత్యం ఇంటిపై ఏసీబీ దాడులు

8 బృందాలతో క్షుణ్ణంగా తనిఖీలు..

భారీగా ఆస్తులు, బంగారం, నగదు గుర్తింపు

ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణ అరెస్ట్ అయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అరెస్ట్ చేసింది. అక్రమాస్తులు బయటపడిన తర్వాత ఆయనను అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. గత 12 గంటలుగా కొనసాగుతున్న ఈ తనిఖీల్లో రెండు ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. మొత్తం 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టిన అధికారులు, నగదు, కీలక పత్రాలు, వివరాలు 2లో..



## హైదరాబాద్‌లో కుండపోత వర్షం

- జలమయమై ట్రాఫిక్‌కు అంతరాయం
- పలుచోట్ల పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలకు చాన్స్
- మరో 48 గంటలు విస్తారంగా వర్షాలు



తెలంగాణలో మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పూర్తిగా మారిపోయిందని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గురువారం కూడా రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండి పలుచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వాతావరణ శాఖ వివరాలు 2లో..

## ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు!

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే...పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది. నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.

## సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి?

మొదటిపేజీ తరువాయి..

సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ఎ÷-లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

## హైదరాబాద్‌లో కుండపోత వర్షం

మొదటిపేజీ తరువాయి..

హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్‌లో బుధవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, కృష్ణానగర్, ఫిలింనగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్‌తో పాటు సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుండపోతతో పలు రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాయి. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

# అట్టుడికిన తెలంగాణం

మొదటిపేజీ తరువాయి..

బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్-ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. కాంగ్రెస్, బిజెపిల ఆందోళనలో భాగంగా హైదరాబాద్ బిజెపి కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది. కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నేతలను అడ్డుకునే క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నంతరం కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో ఆఫీసు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో ఒకే రోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

## మా సమయం వృథా చేయొద్దు

మొదటిపేజీ తరువాయి..

వ్యాఖ్యానించింది. ఇవాళ ఉదయం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. విద్యార్థులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, అందుకు సంబంధించిన వీడియో ఆధారాలు తన వద్ద ఉన్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాటిని పరిశీలించి, రేపు (గురువారం) విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సీజేఐ.. "మేము వీడియోలు చూడాలనుకోవడం లేదు. వాటిని చూసే సమయం మాకు లేదు. మీ, మా సమయాన్ని వృథా చేయొద్దు" అని స్పష్టం చేస్తూ తక్షణ విచారణ అభ్యర్థనను తోసిపుచ్చారు.

# నిరసన తెలిపితే పాశవిక దాడులా?

మొదటిపేజీ తరువాయి..

అమ్ముకుని బీజేపీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు చేపట్టిన నిరసనకు రాజకీయాలకు అతీతంగా పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసి, నీట్ పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవికంగా దాడి జరుపుతారా అంటూ ప్రశ్నించారు. విద్యార్థినులపై దుర్మారంగంగా దాడి చేయడమే కాకుండా.. విద్యార్థుల తలలు పగలగొట్టారన్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించకుండా పోయారని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? ఎవరైనా కిడ్నాప్ చేశారా అని సందేహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పై పాశవికంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. పాశవిక దాడితో రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందిందని, దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని చెప్పారు. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. దేశం కోసం రక్తం చిందించిన గొప్పకుటుంబం ఇందిరమ్మ కుటుంబం అన్నారు. బాంబు దాడితో శరీరం ముక్కలైనా దేశ సమైక్యత కోసం ప్రాణాలిచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని, కనీసం మంత్రి పదవి తీసుకోలేదని తెలిపారు. మన్మోహన్ సింగ్ ను ప్రధాని చేసి త్యాగనిరతిని చాటుకున్న గొప్ప వ్యక్తి సోనియా గాంధీ అని కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని గుర్తు చేశారు. ప్రజా స్వామ్యంలో నిరసన తెలపడం అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని, పేపర్ లీక్ పై పార్లమెంటులో చర్చ జరగకుండా ప్రధాని అడ్డుకున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలో బీఆరెస్ అధికారంలో ఉన్న సమయంలో 2019లో ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడిందని గుర్తు చేశారు. ఆ సంస్థ 27 మంది విద్యార్థుల ప్రాణాలు బలిగొందన్నారు. అనుభవం, అర్హత లేకపోయినా రాజకీయ ఒత్తిళ్లతో ఆనాడు కేటీఆర్ తన బినామీ సంస్థ గ్లోబరీనాకు ప్రాజెక్టును అప్పగించిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని గ్లోబరీనా సంస్థ పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లింది. ఢిల్లీ బీజేపీ వాళ్లతో మాట్లాడుకుని వాళ్లకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చింది. జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై విద్యార్థులు నిరసన తెలిపారని, ధర్మేంద్ర ప్రధాన్ ను పదవి నుంచి తొలగించకుండా విద్యార్థుల తలలు పగలగొట్టారని కేంద్ర ప్రభుత్వ వైఖరిని సీఎం తప్పుపట్టారు. నరేంద్ర, ధర్మేంద్ర ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని, దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. విద్యార్థులు, యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అందరం కలిసి పోరాటం చేసి మోడీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందామని శ్రేణులకు సీఎం పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్ లో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఉదయం కొడంగల్ లోని నివాసంలో ఎస్ఐఆర్ పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నేరుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి చిత్రాలతో కూడిన బ్యానర్ తో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులతో కలిసి భారీ ర్యాలీతో కాలినడకన సీఎం అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నియోజకవర్గ ముఖ్యనాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అక్రమాలకు అడ్డాగా దేశ వ్యవస్థ

మొదటిపేజీ తరువాయి..

ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

# అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు

మొదటిపేజీ తరువాయి..

డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. మరోవైపు, సౌదీ అరేబియాను దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించిన హూతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో 6 నౌకలను అడ్డుకున్నారు. దాంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ ఎగబాకుతాయని ఆందోళన ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ మంగళవారం నాడు ఇరాన్ మిలిటరీ కమాండ్ కేంద్రాలు, మిస్సైల్, డ్రోన్ లాంచ్ ప్యాడ్‌లు, నేవీ, ఎయిర్ ఫోర్స్ బేస్ వ్యవస్థలే ప్రధాన లక్ష్యాలుగా దాడి చేసింది. ఈ భీకర దాడుల కారణంగా ఇరాన్‌లోని ఫార్స్, హర్మోజ్‌గన్, సిస్తాన్, ఇలామ్, కెర్మన్ వంటి పలు ప్రావిన్సులలో భారీ పేలుళ్లు సంభవించినట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. అమెరికా దాడులకు ప్రతికారంగా ఇరాన్ కూడా సమీప దేశాలపై తన దాడులను పెంచింది. వరుసగా నాలుగో రోజు కువైట్‌లోని విద్యుత్, అణు ప్లాంట్లపై విరుచుకుపడటంతో పాటు బహ్రెయిన్ వైపు క్షిపణులను ప్రయోగించింది. హర్మూజ్ జలసంధి సమీపంలో ఒక చమురు ట్యాంకర్ నౌకపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దాడి చేసింది. మరోవైపు తమ గగనతలంలోకి దూసుకొచ్చిన ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను విజయవంతంగా కూల్చివేశాయని జోర్డాన్ సైన్యం ప్రకటించింది. కాగా.. హర్మూజ్ జల సంధిలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పీకాక్స్ పర్వతాల్లో ఇరాన్ నిర్మిస్తున్న అణు స్థావరాన్ని త్వరలోనే పేల్చేస్తామని ఆయన ప్రకటించారు. నంతాజ్ అణు శుద్ధి కేంద్రానికి దక్షిణంగా ఉన్న పీకాక్స్ ప్రాంతం.. 2025లో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరిగిన 12 రోజుల యుద్ధంలో అమెరికా దాడుల నుంచి తప్పించుకుని సురక్షితంగా ఉంది. ఈ సమయంలోనే నంతాజ్ నుంచి వేలాది న్యూక్లియర్ సెంట్రిఫ్యూజుల్ని పీకాక్స్ పర్వతాల వద్దకు తరలించి, వాటిని భూమి లోతుల్లో పాతిపెట్టిందని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు నివేదికలు వెల్లడించాయి. ట్రంప్ ఓవెల్ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ..అమెరికా ఆయుధాగారంలోని అత్యంత శక్తివంతమైన బాంబులకు సైతం అందనంత లోతులో ఇరాన్ సెంట్రిఫ్యూజ్‌లను అక్కడికి తరలించి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

## తెలంగాణకు కేంద్రం శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది. కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి



రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. అంశాలపై పార్లమెంట్‌లో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వడ్ల కొనుగోలు అంచనాను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధరతో కొనుగోలు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఊతమివ్వనుంది. అదనపు కొనుగోళ్లతో రైతులకు ఆర్థిక భరోసా పెరగడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ పక్రియ మరింత సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడింది.

## విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు

మొదటిపేజీ తరువాయి..

పార్లమెంటులో సమాధానాలు ఇస్తామన్నారు. అయితే, విపక్షాలు చీటికిమాటికి గోల్‌పోస్టు మారుస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్ గురించి తమకు పూర్తి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయ్యాయని, యూపీఏ హయాంలో ఎన్నో రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగాయని నడ్డా వ్యాఖ్యానించారు. విద్యార్థుల అంశాన్ని రాజకీయంగా వాడుకోవటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కొన్ని అంశాలనే టార్గెట్‌గా చేసుకుని రాహుల్‌గాంధీ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పేపర్లు



లీక్ జరిగిందని, తెలంగాణలో ఇంటర్ పేపర్, కేరళ, తమిళనాడులో పేపర్లు లీక్ అయ్యాయని తెలిపారు. బంగాల్, కర్ణాటకలోనూ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం బాధ్యయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనల నేపథ్యంలో నడ్డా దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలియజేశారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూసుకుంటుందని నీట్ పేపర్ లీక్ ఆందోళనకారులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను విపక్షాలు కీలుబొమ్మలుగా చేసుకున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు."దిల్లీలో జరుగుతున్న నిరసనలు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి మన దేశ విద్యార్థులను, యువతను రాజకీయ సాధనాలుగా వాడుకోవడానికి ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరం. మోదీ నాయకత్వంలో విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి, అలాగే వారి సంక్షేమం కోసం మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. విద్యార్థుల ప్రతి ఆందోళనను ఆలకించి, వాటిని పరిష్కరించడం మా బాధ్యత. అటువంటి మోసపూరిత ప్రయత్నాలను భారతదేశపు చైతన్యవంతమైన, తెలివైన యువత పూర్తిగా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా. వారు పురోగతి, అభివృద్ధి, దేశ నిర్మాణ మార్గాన్ని ఎంచుకుంటారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కొందరు ప్రతిపక్ష నాయకులు విద్యార్థుల్లో కోపావేశాలను సృష్టిస్తున్నారని రాజ్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువతను తప్పుదోవ పట్టించడానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటులో కాకుండా వీధుల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రతిపక్షం అనుచితమైన ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య సమస్యలను చర్చించడానికి సరైన వేదిక పార్లమెంట్ భవనమని, అక్కడ ప్రతిపక్షానికి తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడించే పూర్తి స్వేచ్ఛ ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం కూడా యువత భావాలు, ఆందోళనలను వినడానికి సిద్ధంగా ఉందని, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రతి అంశంపై అర్థవంతమైన చర్చ జరగాలని ప్రభుత్వం కూడా చెప్పిందన్నారు. సభ సజావుగా పనిచేసేందుకు ప్రతిపక్షాలు అనుమతించాలని కోరుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం, ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో సన్నద్ధతపై రాష్ట్ర నిపుణుల కమిటీ తొలి సమావేశం

వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేయడం కోసం నిపుణుల కమిటీ భేటీ అయ్యింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాల కోసం రాష్ట్ర స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం, ఉపశమన, అనుసరణ చర్యలను సిఫారసు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 మంది సభ్యులతో కూడిన బహుళ విభాగాల నిపుణుల కమిటీ తొలి సమావేశం బుధవారం ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు డా. జీ. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. కమిటీలో భారత వాతావరణ శాఖ, ఇక్రిశాట్, ఐసీఏఆర్-క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ, మార్క్ ఫెడ్, ఆయిల్ ఫెడ్, జాతీయ విత్తన సంస్థ, తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా డా. జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గత ఆరు నెలలుగా ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని చాలా మంది భావించారు.

# వినాయకపురం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో.

- ప్రైవేట్ ల్యాబ్‌లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: డాక్టర్ తుకారాం రాథోడ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 22,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ తుకారాం రాథోడ్ బుధవారం వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో నిర్వహిస్తున్న ప్రైవేట్ రక్తపరీక్ష కేంద్రాల ఇన్‌చార్జీల తో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అన్ని రక్తపరీక్ష కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, ఫైర్ సేఫ్టీ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణకు సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సర్టిఫైడ్ ఎంబీబీఎస్ వైద్యుల సూచనల మేరకే పరీక్షలు నిర్వహించాలని, ల్యాబ్ నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా అర్హతతో కూడిన శిక్షణ పొందివుండాలని తెలిపారు. పరీక్షలకు వినియోగించే రియాజెంట్లు గడువు తేదీలోపు ఉండాలని ఆదేశించారు. ల్యాబ్‌ల లో గుర్తించిన మలేరియా, డెంగీ పాజిటివ్ కేసుల వివరాలను వెంటనే సంబంధిత వైద్య అధికారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గిరిజన సమగ్ర అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి నిర్ణయించిన పరీక్షల రుసుములనే వసూలు చేయాలని స్పష్టం చేశారు. వైద్యాధికారులు డాక్టర్ రాందాస్, డాక్టర్ నౌసిన్ మాట్లాడుతూ ల్యాబ్ నిర్వాహకులు వైద్య శాఖ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, పూర్తి నిర్ధారణ లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ సొంతంగా చికిత్స చేయరాదని హెచ్చరించారు.
ఈ సమావేశంలో రెండు మండలాలకు చెందిన ల్యాబ్ ఇన్‌చార్జ్‌లు, వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీ‌చార్జి అమానుషం

- ఆసుపత్రుల్లోని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి
- ర్యాలీలో గల్లంతైన వారిని త్వరగా గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలి
- నీట్ అక్రమాల వలన ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి



**తొర్రూరు,(సి కే న్యూస్) :** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, లోపభూయిష్టమైన "నీట్" తదితర పోటీ పరీక్షల నిర్వహణ లాంటి సమస్యలపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం అమానుషమని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ దుర్ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సామాజికవేత్త దొనికెన కుమారస్వామి అన్నారు.తొర్రూరు డివిజన్ కేంద్రంలో బుధవారం నాడు దొనికెన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...విద్యార్థులు సంఘ విద్రోహశక్తులు కాదని, అభివృద్ధి నిరోధకులు కాదని, అలజడులు, కల్లోలాలను సృష్టించే అరాచక శక్తులు కాదని, లా అండ్ ఆర్డర్ కు, శాంతి భద్రతలకు భంగం కలిగించేవారు కాదని నిరుద్యోగులు, విద్యార్థులు తమ భవిష్యత్తు భద్రత కోసం ధన మాన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, వ్యయ ప్రయాసలతో చెమటోడ్చి ప్రిపేర్ అయ్యే పోటీ పరీక్షలలో జరుగుతున్న అక్రమాలపై తమ ఆవేదనలను ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశంతో వేలాది మంది విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా, సంయమనంతో ర్యాలీలో పాల్గొని నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయించడం ఎంతవరకు సమంజసమని దొనికెన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజకీయ పార్టీల ప్రేరణతోనో, అదృశ్య శక్తుల ప్రభావంతోనో, మరే ఇతర సంఘాల, సంస్థల ప్రలోభాలకు లోనయ్యో, ఏ ఇతర నాయకుల ప్రోత్సాహంతోనో ఆ విద్యార్థులు ర్యాలీకి, నిరసనకు రాలేదని ఎవరికి వారే వారి వారి సొంత ఖర్చులతో వచ్చి నిరసన ర్యాలీలో కలిశారని దీనిని రాజకీయ కోణంలో చూడకుండా మానవతా దృక్పథంతో చూసి ఆ నిరుద్యోగులు, విద్యార్థుల న్యాయమైన సమస్యలపై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించాలని దొనికెన కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు. లాఠీలతో కొడుతుంటే "కొట్టండి సార్ కొట్టండి, మమ్మల్ని కొట్టండి సార్" అని పరిగెత్తకుండా నిలబడి దెబ్బలు తిన్నారంటే, ఆ విద్యార్థులు ఎంత ఆవేదనతో ఉన్నారో ఆలోచించాల్సింది పోయి, మానవత్వాన్ని మరచి విచక్షణ లేకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టడం చాలా దారుణమని దొనికెన వాపోయారు. ర్యాలీలో తగిలిన బలమైన దెబ్బలకు తీవ్రంగా గాయపడిన ఎంతో మంది విద్యార్థులు ఢిల్లీలోని పలు ఆసుపత్రుల్లో చేరే పరిస్థితి రావడం బాధాకరమని, ఇంకెంతో మంది ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు కనిపించకుండా పోవడం ఆందోళన కలిగిస్తోందని దొనికెన ఆవేదన వ్యక్తంచేశారు. మన దేశంలో దాదాపు 50 శాతానికి పైగా ఉన్న యువతకు సరియైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్ల యువశక్తి నిరుపయోగం అవుతున్నదని దాంతో దేశం అభివృద్ధి చెందలేకపోతున్నదని దొనికెన విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కనిపించకుండా పోయిన విద్యార్థులను వెతికి కనిపెట్టి త్వరగా వారి తల్లిదండ్రులకు అప్పగించాలని, గాయపడిన విద్యార్థులు తొందరగా కోలుకోవడానికి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలని, "నీట్" అక్రమాల వలన ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని అలాగే నిరుద్యోగులు, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని దొనికెన కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పలుఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి

- మధిర రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి : సీపీఐ(ఎం)



మధిర రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ మంజూరు చేయాలని సీపీఐ(ఎం) నాయకులు విజయవాడ డివిజన్ డీఆర్ఎం మోహిత్ సోనిక్య కువినతిపత్రం సమర్పించారు. అన్ని ప్లాట్‌ఫారమ్‌లపై శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం, ఎలక్ట్రానిక్ కోచ్ ఇండికేటర్ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు, కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే గౌతమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సింహపురి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర ప్రధాన రైళ్లకు మధిరలో హాల్ట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ, మండల కార్యదర్శి పడకంటి మురళి, మందా సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు ఎశ్రీఖు ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలి-తుడుం దెబ్బ డిమాండ్



**సికే న్యూస్ కొత్తగూడ మండల (పతినిధి : దుర్గం మురళి** కొత్తగూడ : ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గారు బయ్యారం మండలంలో గిరిజనేతరులకు అన్యాయం జరుగుతుందని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ గారికి మెమోరండం ఇవ్వడంపై ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ తీవ్రంగా ఖండిస్తుంది.
ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసి రైతులు ఆదివాసీ యువతీ యువకులు నిరుద్యోగులు విద్యార్థులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో విచ్చలవిడిగా గిరిజనేతరుల వలసలు పెరిగి ఏజెన్సీ ఏరియా లో గిరిజనేతరులు ఆర్థికంగ రాజకీయంగా తమ పలుకుబడిని పెంచుకొని ఆదివాసీ గూడ లలో గిరిజనేతరులు ఎన్ని విధాలుగా ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారో తెలీదా అని ప్రశ్నించారు.ఆదివాసులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాలకు ఇబ్బందులు తలపెడుతూ 5 వ షెడ్యూల్ ఏజెన్సీ చట్టాలను ఒక్కొకటిగా తీసివేయాలని గిరిజనేతరులు కంకణం కట్టుకొని కోర్టు ల చుట్టూ తిరుగుతుంటే ఆదివాసులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు కనుగుమరుగైపోతున్నాయని తిరిగి 5 షెడ్యూల్ ఏజెన్సీ చట్టాలను హక్కులను జీవో లను తిరిగి అమలు అయ్యేలా నిత్యం ఆదివాసీ సంఘాలు ఆదివాసీ ప్రజలు పోరాటం దిశగా ప్రయాణం చేస్తుంటే ఒక ఆదివాసి ప్రజా ప్రతినిధి అయిన కోరం కనకయ్య గారు ఆదివాసీల పక్షాన కాకుండా గిరిజనేతరుల పక్షాన మాట్లాడంపై ఆదివాసులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు వెంటనే కోరం కనకయ్య గారు ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
బాధ్యత గల హోదాలో ఉండి ఇటువంటి చర్యలకు పాల్పడడం మనుకొని ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులైన ఆదివాసీ యువతీ యువకుల కోసం జీవో నెంబర్ 03, ఐటీడీఏ లలో ఉన్న బ్యాక్లాగ్ పోస్టుల గురించి, ఏజెన్సీ చట్టాలైన పేసా చట్టం,1/70 చట్టాల అమలుకోసం ఆదివాసీ రైతుల కోసం గిరి వికాస ద్వారా బోర్లు ఆదివాసి సమాజానికి ఉపయోగపడే సంక్షేమం కోసం ఆలోచన చేయాలని నా రిజర్వేషన్ ఉన్నది కాబట్టే ఈ రోజు ఎంతో మంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్నారని వివిధ రంగలలో రానిస్తున్నారని ఇట్టి విషయాన్ని గ్రహించాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మహు బాద్ జిల్లా అధ్యక్షులు సువర్ణపాక వెంకట రత్నం పూనేం సందీప్ కుమార్ తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కొత్తగూడ ఈసం శ్యామ్ రావు తుడుం దెబ్బ గంగారం మండల ప్రధాన కార్యదర్శి తుడుం దెబ్బ నాయకులు సువర్ణపాక బాబీ చుంచ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** నాగులవంచలో శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి ఉండ్రాళ్ల కార్యక్రమం గత కొంతకాలంగా వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో నాగులవంచ గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి -- శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో గ్రామ అఖిలపక్ష నాయకులు, భక్తులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు ఏకమై గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలిచారు.
ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా తొలి రోజు శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి ఉండ్రాళ్ల మహోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. గ్రామంపై దేవుని కటాక్షం ఉండి సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల కష్టాలు తొలగి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు మనసారా ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ అఖిలపక్ష నాయకులు, భక్తులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజలు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎలినో ప్రభావం వర్షాభావ పరిస్థితులపై సమీక్ష

- ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి
- పంట కుంటలు ఊట కుంటల నిర్మాణంపై ఎంపీడీవో అరుంధతి సూచనలు,



**షాద్ నగర్ నియోజకవర్గ సి కె న్యూస్ ప్రతినిధి,జూలై 22:** ఎల్నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కొత్తూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్.అరుంధతి సూచించారు బుధవారం మధ్యాహ్నం మండల పరిషత్ కొత్తూరు కార్యాలయ సమావేశ మందిరంలో ఎలినో ప్రభావం--వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడం తెలంగాణ గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక' అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు అలాగే వ్యవసాయ పొలాల వద్ద పంట కుంటలు చెరువుల పరిసరాల్లో ఊట కుంటలు నిర్మించడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించి ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు సూచించారు సమావేశంలో మండల స్థాయి అధికారులు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గంగారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన



మోదీ దిష్టిబొమ్మ దహనం, రాహుల్ గాంధీ అరెస్టును ఖండన

**సికే న్యూస్ మండల (పతినిధి: దుర్గం మురళి :** గంగారం మండలం లోని విద్యార్థులపై జరిగిన దాడులను, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.
టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిగే వీరభద్ర పోతయ్య ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు.కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి, ప్లేకార్డులతో నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని, శాంతియుత నిరసన తెలిపే హక్కును కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లులి మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ పై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరపాలని, ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన హింసపై స్వతంత్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఈసం రమ, సర్పంచులు రాము, లక్ష్మణరావు, స్వరూప, సారయ్య, తార, వెంకటలక్ష్మి, యూత్ అధ్యక్షుడు ఈసం విజయ్, ఈసం హరి, ఉప సర్పంచులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో పంటల మార్పిడితో ఆదాయం పెంచుకోవాలి.

- జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు.
- గట్టుమల్లలో రైతుల అవగాహన సదస్సు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూలై 22:** ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి దీపక్‌తో కలిసి నిర్వహించిన రైతుల అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని రైతులకు పలు కీలక సూచనలు చేశారు.
ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ, బోరు నీటిపై ఆధారపడి వరి సాగు చేయడం వల్ల నీటి కొరత ఏర్పడి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు, మొక్కజొన్న, జొన్న వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు.
ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయ

# గోశాలలో గోమాతల మరణ ఘోష

- చౌడమ్మా గుట్ట ఆంజనేయస్వామి దేవాలయ గోశాలలో ఘోరం
- రెండు ఆవులు మరణించినా చూసుకొని నిర్వాహకులు

**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి జులై 22 :**ప్రపంచంలో మరే జంతువుకూ లేని చాలా ప్రత్యేకతలు గోవుకుంది.
అందుకే హిందువులు తమ తల్లి తర్వాత తల్లి స్థానాన్ని ఇచ్చి " గోమాత " అని గౌరవంగా పిలుస్తూ పూజిస్తారు.. గోమాత అంటే భారతదేశంలోని ఎంత గౌరవం దక్కుతుందో వేరేగా చెప్పనక్కర్లేదు.. అలాంటి గోమాతలకు దక్కిన గోస మరణ ఘోష చూస్తే నిర్వాహకుల తీరుకు అద్దం పడుతుంది. రెండు ఆవులు చనిపోయినా నిర్వాహకులు అటువైపు కన్నీటి కూడా చూడలేదు. రెండు గోమాతల కళేబరాల అక్కడే పడి ఉన్నప్పటికీ పక్కనే మరికొన్ని ఆవులు గడ్డిమేస్తున్నాయి. పాపం నోరులేని జంతువుల అరణ్య రోదన లాగే మిగిలింది. ఆ ఆంజనేయస్వామి సాక్షిగా గోమాతల మృతి ఘోష పై ఓ భక్తుడు ఆవేదన వ్యక్తం చేస్తూ మీడియాకు సమాచారం అందించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ శివారులోని చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ గోశాలలో ఘోరం జరిగింది. రెండు పశువుల కళేబరాలు గోశాలలో గడ్డి కింద ఉన్నాయి. అవి ఎప్పుడు మరణించాయో కూడా తెలియదు నిర్వాహకులు అటువైపు కన్నీటి కూడా చూడనట్టు ఉన్నారు. ఓ భక్తుడు స్వామివారిని దర్శించి గోమాతల వద్దకు ప్రసాదం పెట్టడానికి వెళ్లి ఈ ఘోరం కళ్ళారా చూసి సదరు దృశ్యాలను హాలో షాద్ నగర్ మీడియాకు పంపించారు. నిర్వాహకుల పనితీరును ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు గోదానం చేసిన లేక ఎవరైనా రైతులు గోమాతలను పోషించుకోలేక వాటిని అమ్మలేక పోతే వాటిని తెచ్చి ఇలా దేవాలయాల్లో గోశాలలో అప్పజెప్తారు. లేదా గుడ్డు మాంసం కోసం తరలిస్తుంటే వాటిని పట్టుకొని కూడా భక్తులు ఇక్కడ పెడతారు. అలాంటి పశువుల పాలనా పాలన చూసుకోవాల్సిన నిర్వాహకులు అటువైపు గడివేసి కన్నెత్తి కూడా చూడకుండా ఉంటే వాటి పరిస్థితి మృతి ఘోష ఎవరికి వినిపిస్తుంది ఎవరికి కనిపిస్తుంది. సాక్షాత్తు నిర్వాహకులే ఈ సమాధానం చెప్పాలి. గోశాల నిర్వహణకు ఎంతోమంది భక్తులు చందాలు విరాళాలు ఇస్తుంటారు మరి కొంతమంది గడ్డిని కూడా వాటికి సమకూర్చుతూ ఉంటారు. అయితే అక్కడ కేవలం నిర్వహణ మాత్రమే చూసుకోవాలి. ఇలా అతిగా తీలేని నిర్వహణ పెట్టుకొని పశువులు మరణిస్తుంటే ఏం చేస్తున్నారో వారికే తెలియాలి. నీ విచక్షణ...
నీ చదువు... నీ సంస్కారం... నీ విజ్ఞత... నిజాన్ని నిజాయితీగా స్వీకరించే వ్యక్తిత్వం నీలో ఉంటే... గోమాత బాగోగులు చూసుకోరా..? హిందూ ధార్మిక సంఘాలు ఇలాంటి అన్యాయాలపై గోరాలపై స్పందించాలి నిర్వాహకుల తీరును ప్రశ్నించాలి ఇలాంటివి మళ్లీ జరగకుండా చూడాలి..

## అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణకులకు తప్పని తిప్పలు



**గరిడేపల్లి సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలో ఉన్న గడ్డిపల్లి గ్రామంలో ఆర్ అండ్ బి శాఖ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వాహనదారులకు శాపంగా మారింది. సూర్యాపేట--గరిడేపల్లి ప్రధాన రహదారిపై గడ్డిపల్లి గ్రామం సమీపంలో భారీ గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఈ గుంతల కారణంగా పలు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ఇప్పటికీ స్పందించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
గతంలో పలుమార్లు వివిధ దినపత్రికల్లో ఈ సమస్యపై వార్తలు ప్రచురితమైనా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బుధవారం గడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న భారీ గుంతలో లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ కూరుకుపోవడంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**మంత్రి పర్యటన ఉంటేనే రోడ్డు గుర్తొస్తుందా?**

మండలంలో లేదా గడ్డిపల్లి గ్రామంలో మంత్రి పర్యటన ఉన్నప్పుడు మాత్రమే అధికారులు, కాంట్రాక్టర్ హడావుడిగా గుంతల్లో కంకర పోసి తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. మంత్రి పర్యటన ముగిసిన తర్వాత మాత్రం రహదారిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, సామాన్య ప్రజల ప్రాణాలకు విలువ ఇవ్వడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గడ్డిపల్లి వద్ద దెబ్బతిన్న రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

## రోహిరు గ్రామంలో వరద నీటి తొలగింపు చర్యలు

సర్పంచ్ కావిరి అర్జున్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు




**ఏటూరునాగారం, జూలై 22:**గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏటూరునాగారం మండలంలోని రోహిరు గ్రామంలో వర్షపు నీరు భారీగా నిలిచి, పలువురు గ్రామస్తుల ఇళ్లలోకి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో నిల్వ ఉన్న వరద నీటి వల్ల డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో గ్రామ పంచాయతీ వెంటనే స్పందించింది.
గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో కాలువలు తవ్వించి, గ్రామంలో నిలిచిన వరద నీటిని బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలో నీరు నిల్వ లేకుండా చేసి ప్రజలకు ఉపశమనం కల్పించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టామని, అవసరమైతే మరిన్ని పారిశుద్ధ్య కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. అలాగే గ్రామ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డోంగిరి మధుబాబు, వార్డు సభ్యులు సోదరి రాజేష్, గజ్జల అంకుల్, మాజీ వార్డు సభ్యులు ఆకుదారి గంగాధర్, కారోబార్ శంకర్, ఆకుదారి రమేష్, బేడిక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదు

- షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్
- పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుంది
- నెక్లెస్ రోడ్ నుంచి రాజ్‌భవన్ వరకు భారీ ధర్నా
- ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్




**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి జులై 22 :**ఢిల్లీలో నీట్ పరీక్ష వివాదం, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీఛార్జీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన ధర్నాలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొని మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి పరీక్షలు రాస్తున్నారని, అలాంటి పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకుంటే వారి జీవితాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అన్నారు. విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలపై ప్రశాంతంగా నిరసన వ్యక్తం చేస్తే వారిపై లాఠీఛార్జ్ చేయడం, పోలీసుల బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వీర్లపల్లి శంకర్ అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై అణచివేత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు.
ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.
ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాయడానికి ఎవరూ ప్రయత్నించకూడదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు, పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.
నీట్ పరీక్షపై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. దేశ యువతకు అండగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, విద్యార్థుల హక్కుల కోసం అవసరమైతే మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆయన తెలిపారు.

# సిద్ధాపూర్ వ్యవహారంపై కలెక్టర్ తో కాంగ్రెస్ నేతల చర్చ

- సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌తో తీవ్ర దుష్ఫలితాలు
- షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి
- కలెక్టర్‌కు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి వివరణ

**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి జూలై 22 :**సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ప్రజలు, రైతులు, పరిసర గ్రామాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ మేరకు డంపింగ్ యార్డ్ వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి ప్రజెంటేషన్ ఇచ్చి వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం, చెత్త నుంచి వెలువడే రసాయనాలు, విషపదార్థాలు నేలలోకి చేరి వ్యవసాయ భూముల నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా చెత్త కుళ్లడం ద్వారా వెలువడే దుర్వాసన, హానికర వాయువుల కారణంగా గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. డంపింగ్ యార్డ్ పరిసరాల్లో దోమలు, ఈగలు, కీటకాలు పెరిగి అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. చెత్త నుంచి వచ్చే లీచేట్ (కలుషిత ద్రవం) భూమిలోకి చొచ్చుకుపోతే బోర్లు, బావులు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే డంపింగ్ యార్డ్‌కు ప్రతిరోజూ భారీ వాహనాల రాకపోకలు పెరగడం వల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు, దుమ్ము కాలుష్యం, శబ్ద కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో జనాభా పెరిగే కొద్దీ చెత్త పరిమాణం పెరిగి సమస్య మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నాం:**



**కలెక్టర్**

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు అంశంపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ జేఏసీ సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల అభ్యంతరాలు, స్థానిక పరిస్థితులను పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తున్నట్లు కలెక్టర్ సూచనప్రాయంగా వెల్లడించినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. దీంతో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంలో సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. డంపింగ్ యార్డ్‌ను అంగీకరించే ప్రసక్తే లేదు
సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రజలు, కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, భూగర్భ జలాలను కాపాడేందుకు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి అధికారికంగా ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. అవసరమైతే ప్రజల పక్షాన మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన జేఏసీ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యామ్ సుందర్ రెడ్డి, డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ జేఏసీ చైర్మన్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## చింతకాని లో వార్డు సభ్యుల సమావేశం.





**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సమావేశం ఉదయం నిర్వహించడం జరిగింది.
ఈ యొక్క సమావేశంలో పంచాయతీలో పరిధిలో ఉన్న సమస్యల గురించి చర్చించి వాటి పరిష్కారానికై తీర్మానం చేయడం జరిగింది.
మరియు రానున్న రోజుల్లో వర్షాల ప్రభావం ఉన్న నేపథ్యంలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు దృష్టి సారించాలని డ్రైనేజీలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి మరియు ఇళ్లల్లో మరుగునీరు ఉండకుండా చూడాలని సర్పంచ్ మనోహర్ బాబు సూచనలు చేయడం జరిగింది.
ఈ కార్యక్రమం లో సెక్రటరీ రమేష్ బాబు, ఉప సర్పంచ్ కోలా ఉమారాణి,
వార్డు మెంబెర్స్ కిలారు బాబురావు, షేక్ రహీమ్ తుల్లా, పొనుగోటి బాబు, వేముల ఆకాష్, గంధసిరి లలిత పాల్గొన్నారు

# జంతర్ మంతర్‌లో విద్యార్థులు, యువతపై పోలీసుల దమనకాండను తీవ్రంగ ఖండించిన AILU.

**సి కే న్యూస్ వలిగొండ మండలం, ప్రతినిధి బాలరాజు జులై 22.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం.
రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి
జూలై 22, 2026:
జంతర్ మంతర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతూ పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్తున్న నిరాయుధ విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు జరిపిన అమానుష లాఠీచార్జ్, అక్రమ నిర్బంధాలు, దౌర్జన్యాలను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు, యువత తమ రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకుంటున్న సమయంలో వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొంది. పోలీసుల దౌర్జన్యాలను చిత్రీకరించిన మీడియా ప్రతినిధులను సైతం వీడియోలు తొలగించేలా బలవంతం చేయడం అత్యంత ఖండనీయమని తెలిపింది.
భారత రాజ్యాంగంలోని 19, 21 అధికరణలు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ, శాంతియుత సమావేశాల హక్కు, నిరసన తెలిపే హక్కులను ప్రభుత్వం, పోలీసులు గౌరవించాలని ఐలు డిమాండ్ చేసింది. పోలీసుల అమానుష వైఖరి ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా పేర్కొంది.
శాంతియుత నిరసనకారులపై నమోదు చేసిన తప్పుడు క్రిమినల్ కేసులన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని, అధిక బలప్రయోగానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐలు డిమాండ్ చేసింది.
రాజ్యాంగ పరిరక్షణ, పౌర హక్కుల రక్షణ, చట్ట పరిపాలనను కాపాడడం న్యాయవాదుల బాధ్యత అని పేర్కొంటూ, విద్యార్థుల న్యాయమైన ఉద్యమానికి ఐలు తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించింది.
సంబంధిత అధికారులు సంయమనం, పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఐ లు జిల్లా గౌరవ అధ్యక్షుడు కుక్క దువ సోమయ్య అధ్యక్షులు బొల్లేపల్లి కుమార్‌ఉపాధ్యక్షులు ఎండి నేహాల్, చింతల రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి బొడ్డు కిషన్, జిట్టా భాస్కర్ రెడ్డి పిడుగు ఐలయ్య ఆకుల మల్లేష్ ఎండి హమీద్ తదితరులు పాల్గొన్నారు.



# గోనుపాడు గ్రామ పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది....

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల



డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే ...

ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షన్ హాల్ నందు గద్వాల మండల పరిధిలోని గోనుపాడు గ్రామంలోని 25 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను గోనుపాడు గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ గారి చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాలను అందజేయడం జరిగింది...

ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహాలు యాదవ్, వ్యవసాయం మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్స్, మాజీ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మజీద్, కౌన్సిలర్స్, మాజీ కౌన్సిలర్స్ వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికుల ఆర్టిజన్ల, అన్‌మ్యాన్ వర్కర్ల హామీలను వెంటనే అమలు చేయాలి.

- ఉద్యోగుల ఆగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుంది.
- బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న



**ములుగు, జూలై 22 :** విద్యుత్ కార్మికుల ఆర్టిజన్ల, అన్‌మ్యాన్ వర్కర్ల ఏప్రిల్ 8 నుండి చేసిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయకపోవడం దారుణమని బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న విమర్శించారు.. సమ్మె విరమింపజేసే సమయంలో ప్రభుత్వం పలు హామీలు ఇచ్చి, అనంతరం వాటిని పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు..

రాష్ట్రవ్యాప్తంగా ప్రాణజూ హైదరాబాద్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడుతున్న ఆర్టిజన్ల, అన్‌మ్యాన్ వర్కర్లను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని అన్నారు. సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు కూడా ఇప్పటి వరకు చెల్లించకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన గానీ, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ గానీ ఇవ్వలేదని భూక్య జంపన్న అన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో టాడా వ్యవస్థలను ఏర్పాటు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో ఎలాంటి ఉపయోగం లేదని, అయితే ఈ పనుల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.

జిల్లాల్లో జేసీఎం పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యుత్ సిబ్బందిపై పనిభారం పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను విడుదల చేసి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే, ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్ల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న హెచ్చరించారు.

# డంపింగ్ యార్డ్ ను శుభ్రం చేయించిన సర్పంచ్...



**మల్దకల్ జులై 22:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల విఠలాపురం గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛ గ్రామం దిశగా విఠలాపురం గ్రామ సర్పంచ్ సిలోంతమ్మ మల్దకల్ పంచాయతీని ప్రత్యక్ష చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే చాలా కాలంగా పేరుకుపోయిన చెత్త చెదారంతో దుర్వాసన వెదజల్లుతున్న స్థానిక డంపింగ్ యార్డ్ ను స్వయంగా సర్పంచ్ సులోంతమ్మ మల్దకల్ గ్రామ సర్పంచ్ పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో పూర్తిగా శుభ్రం చేయించారు గ్రామంలో ప్రతిరోజు ఇళ్ల నుంచి సేకరిస్తున్న తడి, కుడి చేతను ఒకే చోట చేర్చడం ద్వారా డంపింగ్ యార్డులో చెత్త దిబ్బలుగా ఏర్పడ్డాయి. దీనివల్ల వర్షాకాలంలో దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గుర్తించి సర్పంచ్, ఈ క్లీనింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జెసిబి, ట్రాక్టర్ల సాయంతో పాత చెత్తను తొలగించి, క్రిమిసంహారక మందులు పిచికారి చేయించారు. భవిష్యత్తులో చెత్త పేరుకోపోకుండా, కంపోస్టు ఎరువుల తయారీ వంటి పద్ధతులను అవలబిస్తామని, ఈ సందర్భంగా సర్పంచ్ రోడ్లు గుంతలుగా ఉన్న వాటికి మట్టిని ట్రాక్టర్లతో వేయించి శుభ్రం చేశారు అని గ్రామస్తులు తెలిపారు

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు కదలిక

- 100 అడుగుల మేర రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు
- ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- అభివృద్ధికి అందరూ సహకరించాలి
- షాద్‌నగర్ ఆర్డీవో ఎన్.ఆర్. సరిత తదితర అధికారుల ప్రజాప్రతినిధుల హాజరు..



**షాద్‌నగర్ నియోజకవర్గ సి కె న్యూస్ ప్రతినిధి జులై 22**

షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తరణకు ఎట్టకేలకు కదలిక మొదలైంది. చౌరస్తా విస్తరణకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చౌరస్తా విస్తరణ అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించి, వివిధ వర్గాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు.

ఈ సమావేశానికి ఆర్డీవో ఎన్.ఆర్. సరిత, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆర్డీవో ఎన్.ఆర్. సరిత మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ కోసం ఎన్నో సంవత్సరాలుగా ప్రజల నుంచి డిమాండ్ వస్తోందన్నారు. చౌరస్తా పరిధిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు ఉండటంతో ఫ్రీ లెఫ్ట్ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. చౌరస్తా విస్తరణకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు.

విగ్రహాలను గౌరవప్రదంగా మరోచోటికి తరలించి, రహదారి విస్తరణ అనంతరం ప్రజల డిమాండ్ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తామని ఆమె చెప్పారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అంటే తనకు ఎంతో గౌరవమని, ఆయన రూపొందించిన రిజర్వేషన్ వ్యవస్థ కారణంగానే తాను ఆర్డీవోగా ఉన్నానని తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు విశాల దృక్పథంతో ఆలోచించి సహకరించాలని కోరారు. చౌరస్తాను 100 అడుగుల మేర విస్తరించి, నలువైపులా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. చౌరస్తా పరిధిలోని ఆక్రమణలను తొలగించి, రహదారులను విస్తరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ కాంగ్రెస్ నేత రఘునాయక్, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఇనపక ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ మహనీయుల విగ్రహాల పట్ల అందరికీ గౌరవం ఉందని, అయితే ప్రజల రాకపోకలకు, పట్టణ అభివృద్ధికి విగ్రహాలు అడ్డంకిగా మారకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని చౌరస్తా విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ మాట్లాడుతూ చౌరస్తా అభివృద్ధికి ఎమ్మార్పీఎస్ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. రహదారి విస్తరణ అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని సెంట్రల్ చౌరస్తాలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పరిగి రోడ్డు విస్తరణ కోసం రూ.5.70 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో ఆక్రమణలను తొలగించి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. గతంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. రహదారి విస్తరణలో భాగంగా భవన యజమానులు ఎవరైనా నష్టపోతే వారికి నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి రహదారి విస్తరణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.

చౌరస్తా రోడ్డు విస్తరణ ఉద్యమకారుడు ఆర్యన్ రాము మాట్లాడుతూ చౌరస్తా విస్తరణ జరగకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి విస్తరణ పనులను చేపట్టాలని కోరారు. బీసీ మహిళా నాయకురాలు జయశ్రీ కూడా రహదారి విస్తరణ పనులను త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గ కిషోర్ మాట్లాడుతూ రహదారి విస్తరణ అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ప్రధాన చౌరస్తాకు 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్' గా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణ అభివృద్ధి, ప్రజల రాకపోకల సౌకర్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారాన్ని దృష్టిలో ఉంచుకుని చౌరస్తా విస్తరణ పనులను త్వరితగతిన చేపట్టాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలు కోరారు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు..

# ప్రతి ఓటును కాపాడుకోవాలి

- బిఎల్ ఏ లు క్షేత్రస్థాయిలోనే ఉండాలి
- టీజీపీసీసీ జనరల్ సెక్రెటరీ, కాంగ్రెస్ పార్టీ సర్ నియోజకవర్గ ఇన్చార్జి సానెం శ్రీనివాస్ గౌడ్

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల**

గద్వాల పట్టణం మున్సిపాలిటీ వార్డులలో పర్యటించిన శ్రీనివాస్ గౌడ్

ఈ రోజు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని 3, 33 11 10, 24 వార్డులలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్ , డిసిసి వైస్ ప్రెసిడెంట్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ రామేశ్వరమ్మ గార్ల ఆధ్వర్యంలో పర్యటించారు.

ఈ సందర్భంగా అబ్జర్వర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మరియు టిపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గార్ల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పర్యటించడం జరిగిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో ఓట్లను తొలగించేందుకు కుట్రలు చేసిందని వారి కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బిఎల్ ఏ లు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉంటూ అర్హులైన ప్రతి ఓటును కాపాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ కలిసికట్టుగా ఏ ఒక్క ఓటు ను కూడా గల్లంతు కాకుండా, కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీనివాస్ గౌడ్ గారు దిశా నిర్దేశం చేశారు.



ఈ సందర్భంగా బిఎల్‌ఏలకు, బిఎల్‌ఓ లకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు జరిగిన ఎలిమినేషన్ ఫారంలో పంపిణీ మరియు స్వీకరణపై అడిగి తెలుసుకున్నారు. అలాగే డోర్ లాక్, డబుల్ ఓట్లు, మరణించిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బిఎల్ ఏ ల పనితీరుపై, అలాగే కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పనితీరుపై, ఎప్పటికప్పుడు అధిష్టానానికి నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు.

అలాగే పట్టణంలోని 24వ వార్డు 224 బూత్ లో 92 శాతం పూర్తిచేసిన బిఎల్ ఓ ను, బి ఎల్ ఏను, మున్సిపల్ అధికారులను శాలువతో సన్మానించారు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాగులు యాదవ్, మోసిన్, డీసీసీ కార్యదర్శి పూడూరు శ్యామ్, మాజీ పట్టణ అధ్యక్షులు ఇసాక్, నాయకులు కురుమన్న, శ్రీనివాసులు, రిజ్వాన్ ఆయా వార్డుల బిఎల్‌ఏ లు తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాద నేపథ్యంలో సర్పంచ్ భర్త పై దాడి...



**మల్దకల్ జులై 22 :** జోగులంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పవనంపల్లి గ్రామంలో పొలం వివాదం తీవ్ర ఉద్రిక్తత దారితీసింది గ్రామంలోని పొలం గేట్ల పంచాయతీ (వివాదం) సర్ది చెప్పడానికి వెళ్లిన స్థానిక మహిళ సర్పంచ్ రాజేశ్వరి భర్త రామాంజనేయులు పై ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు కుమ్మకుడిగా దాడికి తెగపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. పవనంపల్లి గ్రామ సర్పంచ్ గా రాజేశ్వరి ఎన్నికైనప్పటి నుంచి ఓటమిని జీర్ణించుకోలేని ప్రత్యర్థి వర్గం వారు తమపై నిరంతరం కక్షపూరితంగా వ్యవహరిస్తూ, దాడులకు పాల్పడుతున్నారు. ఈ కార్యక్రమంలోని గ్రామంలో ఒక పొలం గేట్ల వివాదం పల్లె ఎత్తడంతో, దానిని పరిష్కరించేందుకు సర్పంచ్ భర్త రామాంజనేయులు అక్కడికి వెళ్లారు. అయితే, పూర్వపు కక్షలను మనసులో పెట్టుకున్న ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు ఒక్కసారిగా రాళ్లు కట్టెలతో ఆయన పై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. ఈ ప్రమాదం నుండి రామాంజనేయులు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘోర దాడి ఘటనపై సర్పంచి రాజేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు పేద కుటుంబం నుండి తమ సర్పంచ్ గా గెలిచినందుకే ఓర్వలేక ఇలాంటి దాడులకు దిగబడుతున్నారని గ్రామ ప్రథమ రాలిగా రక్షణ లేకుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు ఈ విషయమై సర్పంచ్ దంపతులు గద్వాల జిల్లా ( ఎస్పీ)కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ.. విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, తమకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ దాడి ఘటనతో పవనం పల్లి గ్రామంలో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇట్టి విషయాంపై మల్దకల్ ఎస్సై శ్రీ హరిని సంప్రదించగా ఇప్పటిదాకా ఎటువంటి ఫిర్యాదు అందలేదని అందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అంగన్వాడి శిశువులకు యూనిఫామ్ పంపిణీ...

గ్రామ సర్పంచ్ నార్యయనాక్



**జోగులాంబ గద్వాల జిల్లా జూలై 22 (బుధవారం ):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దతండా గ్రామ పంచాయ తీలో.. చిన్న తండాకు అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి శిశువులకు యూనిఫామ్ పంపిణీ చేశారు.. అలాగే గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ. శిశువు లకు బాల అమృతం, మరియు గుడ్లు, పాలు, పౌష్టికాహారంతోపాటు,అన్నీ కూడా సక్రమంగా అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పుష్ప,హనుమంతు,నరసిం హులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంపై నేడు అవగాహన సదస్సు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలంలోని తిరుమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 2.00 గంటలకు ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించే సదస్సు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తెలిపారు.

ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, పంటల ఎంపిక, నీటి నిర్వహణ, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నారు.

మన గ్రామానికి జిల్లా, మండల అధికారులు విచ్చేస్తున్నందున గ్రామంలోని రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల పై లాఠీచార్జి సిగ్గుచేటు

- ప్రశ్నిస్తే అరెస్టా?,
- ఖండించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్

**జూలై 21 సీ కే న్యూస్ చేగుంట**
మంగళవారం ఢిల్లీలో చలో పార్లమెంట్" కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్,సీజెపి కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేయడం, ఎంత వరకు న్యాయం, విద్యార్థులపై లాటి ఛార్జ్ నీ ఖండించిన ప్రతిపక్ష పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, రాహుల్ గాంధీ అరెస్ట్ ను నిరసిస్తూ, కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు, చేగుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్, ఆధ్వర్యంలో చేగుంట గాంధీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా వ్యవస్థ సంస్కరణలు, పరీక్షల పేపర్ లీకేజీల నివారణ కోసం పోరాడుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రధాన మంత్రి మోడీ,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని, మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేగుంట పట్టణ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు మసాయి పేట్ శ్రీనివాస్, మండల జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు మొహమ్మద్ ముజామిల్, స్టాలిన్ నర్సింలు, ఇబ్రహీం పూర్ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్, చిన్న శివనూర్ ఉపసర్పంచ్ బోలా ప్రశాంత్, మోహన్ నాయక్, సతీష్, మహేష్, నళిని, రాజు సాయి, శంకర్, మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు కేటాయించండి అయ్యామంత్రి ఉత్తం సారు

**వికలాంగుడు కొమర్రాజు నరసింహారావు**



**గరిడేపల్లి సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు.** మండల మండల కేంద్రంలో నివాసం ఉంటున్న కొమర్రాజు నరసింహారావు తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు వేడుకున్న ఫలితం లేకుండా పోయింది ప్రజా పాలనలో తన భార్య రమణి పేరుతో దరఖాస్తు చేసుకున్న ఆ వికలాంగుడు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గరిడేపల్లి గ్రామానికి పైలట్ ప్రాజెక్టు కింద 441 ఇల్లు మంజూరైన తమ బీద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని వాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అధికారులకు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చిన చివరికి సూర్యపేట జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం ఇచ్చినా కూడా ఆ వికలాంగ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు రావడం భారంగా మారిందని వారు అన్నారు వికలాంగ జీవితంలో తనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని తన జీవితం ఉదయాన్నే లేచి పోలీస్ స్టేషన్ ముందు పిటిషన్లు రాసి కాలం గడుపుతున్నానని ప్రజా ప్రభుత్వం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తన ఆవేదనను అర్థం చేసుకొని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆ కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు

## రోడ్డు విస్తీర్ణం ఆలస్యం ఎందుకు అయ్యింది?

- ప్రజల ప్రాణాలు కోల్పోతేనే స్పందించి,చర్యలు తీసుకుంటారా?
- రోడ్డు విస్తరణ సమావేశంలో బీసీ జనసేన అధ్యక్షులు కత్తి చంద్ర శేఖర అప్ప ఆవేదన.
- రోడ్డు విస్తరణ మోక్షం లభించినందుకు ఎమ్మెల్యే కు,ఆర్డీవో కు ప్రత్యేక ధన్యవాదములు.



**సి కే న్యూస్ షాద్ నగర్ :జులై 22**
ఇన్ని సంవత్సరాలు రోడ్డు విస్తీర్ణం ఆలస్యం ఎందుకు అయ్యింది,అధికారుల నిర్లక్ష్యమా లేక నాయకులు స్పందన లేకపోవడమా, ఏదిఏమైనా చాలా రోజుల తర్వాత స్థానిక ఎమ్మెల్యే శంకర్,ఆర్డీవో సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన రోడ్డు విస్తరణ సమావేశంలో సరైనా నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తున్నామని మీడియా ద్వారా హార్శం వ్యక్తం చేశారు బీసీ జనసేన అధ్యక్షులు కత్తి చంద్ర శేఖర అప్ప.బుధవారం రోడ్డు విస్తరణ కార్యక్రమంపై అటు ఎమ్మెల్యే, ఇటు ఆర్డీవో నిర్ణయం పై మీడియా ముఖంగా సంతోషం వెలిబుచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,,,ప్రజలు ఎంత ఇబ్బంది పడుతూ ప్రాణాలు కోల్పోయిన ఇంకా ఎన్ని రోజులు ఎదురు చూపులు ఎందుకని ప్రశ్నించారు.పక్కన ఉన్న చిన్న పట్టణం అయినా బాలనగర్ లో బ్రిడ్జ్ ప్రారంభోత్సవ దిశగా ఏర్పడుతుంది.జడ్చర్ల చిన్న పట్టణంలో కూడా బ్రిడ్జి ఎప్పుడు ఏర్పడింది.మరి పట్టణంలో ఇంకా మోక్షం కోసం ఎన్ని రోజులు చూడాలని అన్నారు.రోడ్డు విస్తరణ కోసం ప్రతి ఒక్కరు ఎదురుచూస్తున్నారన్నారు. హైదరాబాద్ నుండి వచ్చిన పరిగి నుండి వచ్చిన కేశంపేట నుండి వచ్చిన మహబూబ్ నగర్ నుండి వచ్చిన ప్రతి ఒక్కరికి ఇబ్బంది కలుగుతూనే ఉందని ఆవేదన చెందారు.హైదరాబాద్ దగ్గరలో ఇంత పెద్ద పట్టణము ఉన్నా,ఐటి కంపెనీలు పెద్ద పెద్ద కంపెనీలు పెద్ద ఎత్తున బిజినెస్ జరిగే ఇంకా రోడ్డు విస్తీర్ణం కాలేదంటే ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతున్నారని తెలిపారు.విస్థిర కార్యక్రమాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు.మరోసారి విస్తరణకు సంబందించిన పనులను సోమవారం నుండి ప్రారంభించబోతున్న సందర్భంగా ఎమ్మెల్యే కు,ఆర్డీవో,మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్,నాయకులకు,మున్సిపల్ అధికారులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## ముస్లిం మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల**
ఇందిరమ్మ మైనార్టీ మహిళ శక్తి పథకం కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గారు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ది...
త్వరలో మళ్లీ 200 మంది లబ్ధిదారులకు కుట్టు మిషన్ల పంపిణీ...

ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షన్ హాల్ నందు గద్వాల నియోజకవర్గం లోని ఇందిరమ్మ మైనార్టీ మహిళ శక్తి పథకం కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ... లిరాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ హాజరయ్యారు.

135 మంది మైనార్టీ మహిళా లబ్ధిదారులకు ఎమ్మెల్యే , రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది...

ఎమ్మెల్యే మాట్లాడుతూ.....

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేయడం వేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శ్రీ శక్తి పథకంలో భాగంలో నియోజకవర్గంలో నిరుపేదలైన మైనార్టీ సోదరీమణులకు మహిళలకు కుట్టు మిషన్లు అందించడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

మైనార్టీ కుటుంబాలు చాలా పెద్దగా ఉంటాయి వారికి వారికి జీవన ఉపాధి కొరకు కుట్టుమిషన్లు ప్రభుత్వం అందించడం జరుగుతుంది . ఈ కుట్టు మిషన్ ద్వారా మహిళలు ఇంటిదగ్గర కుట్టు మిషన్ ను ద్వారా ఉపాధిని పొందే విధంగా కృషి చేయాలని ఆర్థికంగా మైనార్టీ మహిళలు కూడా ఎదగాలని తెలిపారు.

మా ప్రాంతంలో మైనార్టీలు చాలామంది ఉన్నారు. 135 మాత్రమే వచ్చాయి ఇంకా 300 పైగా చైర్మన్ గారు మంజూరు చేయించి మైనార్టీలకు మహిళలకు సహకరించాలని కోరారు.

అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలకు పెద్దపీట వేయడం జరిగింది బస్సులలో మహిళలకు ఉచితం సౌకర్యం అదేవిధంగా మహిళా సంఘాలలో వడ్డీ లేని రుణాలను అందిస్తూ మహిళలు కూడా ఆర్థికంగా బలోపితం కావాలని ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుంది కోటి మంది మహిళలను కోటీశ్వరాలను చేయడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు.

మైనార్టీ సంక్షేమానికి, అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అని తెలిపారు .

రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ గారు మాట్లాడుతూ...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ పాలనలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా నిరుపేదలైన ముస్లిం సోదరీమణుల కోసం కుట్టు మిషన్ పంపిణీ చేయడం జరుగుతుంది అని తెలిపారు.

మైనార్టీ సంక్షేమం కోసం అనేకమైన సంక్షేమ పథకాలను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అర్హులైన లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ముస్లిం మైనార్టీ విద్యార్థులు చదువుకోవడానికి మైనార్టీ గురుకుల పాఠశాలలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. డిగ్రీ వరకు మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్యే కోరినట్లే గద్వాల ప్రాంతానికి త్వరలోనే వారం 15 రోజులు మరో 200 కుట్టు మిషన్లను ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేసే విధంగా కృషి చేస్తాను అదేవిధంగా మరొక నెలలో రోజుల్లో మరి కొంతమందికి కుట్టు మిషన్లు అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహాలు యాదవ్, వ్యవసాయం మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్స్, మాజీ కౌన్సిలర్స్ వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తరగతి గది నుంచి విజ్ఞాన లోకంలోకి... జిల్లా సైన్స్ మ్యూజియంలో శ్రీ గ్లోబల్ హైస్కూల్ విద్యార్థుల విద్యా విహారం







**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, పుస్తకాలలోని సిద్ధాంతాలకు ఆచరణాత్మక అనుభవాన్ని జోడించే లక్ష్యంతో శ్రీ గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ విద్యా విహారం విద్యార్థులకు కొత్త అనుభూతిని కలిగించడమే కాకుండా విజ్ఞానంపై మరింత ఆసక్తిని పెంచింది.
తరగతి గది నాలుగు గోడల మధ్య పాఠాలు నేర్చుకునే విద్యార్థులు, నేరుగా విజ్ఞాన ప్రపంచంలోకి అడుగుపెట్టి సైన్స్ అద్భుతాలను స్వయంగా పరిశీలించి ఆనందించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాలు, విజ్ఞాన ప్రదర్శనలు వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి.
ఈ సందర్భంగా జిల్లా సైన్స్ మ్యూజియం ఇన్‌చార్జ్ డీఎస్ఓ ఈ. వెంకటేశ్వర్లు విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించి, మ్యూజియంలోని వివిధ శాస్త్ర నమూనాల పనితీరు, వాటి వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను సరళంగా వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ విజ్ఞానాన్ని ఆసక్తికరంగా అందించారు.
మ్యూజియంలో విద్యార్థులు ముఖ్యంగా మానవ కన్ను (హ్యూమన్ హై) నిర్మాణం, ఉత్తల , అవతల అద్దాల పనితీరు, బ్లాక్ హోల్ ,భావన, బెర్నోలి సూత్రం , అలాగే గతిశక్తి మరియు స్థితిశక్తి వంటి శాస్త్రీయ అంశాలను ప్రత్యక్ష నమూనాల ద్వారా తెలుసుకున్నారు.
ఈ విద్యా పర్యటనలో పాఠశాల ఫిజికల్ సైన్స్, బయాలజీ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివిధ నమూనాలపై అవగాహన కల్పించారు.
ఈ విద్యా విహారం ద్వారా విద్యార్థుల్లో పరిశీలనా నైపుణ్యం, శాస్త్రీయ ఆలోచనా విధానం, విజ్ఞానంపై ఆసక్తి మరింత పెరిగిందని పాఠశాల యాజమాన్యం అయినా ఇనుకుల్ల దివాకర్ రెడ్డి, వాహిని, సుధాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి మరియు పాఠశాల ప్రిన్సిపల్ తన్నీరు రామారావు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తెలపడం జరిగింది.విద్యార్థులు కూడా ఈ పర్యటన తమకు మరపురాని అనుభవంగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ మరియు బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయులు అయిన ఎస్. పవన్ కుమార్, ఎన్, కృష్ణ మరియు సలీం మొదలగు వారు పాల్గొన్నారు.

## ఓటర్ సర్వే నిర్వహణ




**సీకే న్యూస్ కొల్చారం నర్సాపూర్:**మెదక్ జిల్లాకొల్చారం మండల కేంద్రంలో మరియు చిన్న ఘనాపూర్ గ్రామపంచాయతీ (ఎస్ ఐ ఆర్) ఓటర్ సమగ్ర సర్వే పై ఓటర్ డిజిల్యేషన్ ఎలా జరుగుతుందని విషయాన్ని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి గారు జిల్లా కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి గారు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గారు ఆదేశాల మేరకు నేడు పర్యవేక్షించడం జరిగింది

అలాగే మండలంలోని బిఎల్ఎ సూపర్వైజర్లకి రోజువారి నివేదిక ఏ విధంగా సమర్పించాలని దానిపై వారికి దిశ నిర్దేశం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కొల్చారం గ్రామ సర్పంచ్ దేవనగారి శేఖర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ చిన్నగాపూర్ సర్పంచ్ చందాపురం మల్సన్ రెడ్డి మండల జనరల్ సెక్రెటరీ గంగసాని మహేశ్వర్ రెడ్డి సూపర్వైజర్ ప్రవీణ్ రెడ్డి ఉప సర్పంచ్ నర్సింలు రమేష్ నాగరాజు బిఎల్వోలు అశోక్ శ్రావణ్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు

## మాస్టర్ ఇ.కె. శతజయంతి.. ఉచిత వైద్య సేవలు




**తిమ్మారావుపేటలో ఆరోగ్య సేవలందించిన సేవా సంస్థ**

**సీకే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జూలై 23 2026:** ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామంలో మాస్టర్ ఇక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె.) శతజయంతి ఉత్సవాల సందర్భంగా 'మాస్టర్ ఇ.కె. ఆధ్యాత్మిక సేవా సంస్థ' ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన హోమియోపతి మందులను పంపిణీ చేశారు. 100 గ్రామాల్లో ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని తమ్మన మురళి, వుగ్గం మూర్తి, వేగినాటి నరసింహారావు, రామాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయగా, సేవా సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు.

## బేస్ లైన్ పరీక్షలను పరిశీలించిన, కాంప్లెక్స్ హెచ్ఎం



**జులై 22 (సీకే న్యూస్) చేగుంట:** చేగుంట మండలం రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణారావు సందర్శించి బేస్ లైన్ పరీక్ష నిర్వహణను పరిశీలించారు, విద్యార్థుల రాత పరీక్ష పత్రాలను భద్రంగా భద్రపరచాలని పాఠశాల హెచ్ఎం కు సూచించారు, కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్ పి సంతోష్ రెడ్డి పాల్గొన్నారు,




## టాక్సిక్.. అందరికీ కాదు!

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి, తారా సుతారియాలు హీరోయిన్లుగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కించిన భారీ యాక్షన్ చిత్రం "టాక్సిక్". గ్లోబల్ లెవెల్లో రిలీజ్‌కి తీసుకొస్తున్న సినిమా నిర్మాత ముందే హెచ్చరిక ఇచ్చేస్తున్నారు. నిర్మాత కే ఎల్ వెంకటనారాయణ లేటెస్ట్ ఇంటర్వ్యూలో టాక్సిక్‌పై అందరికీ ఒక క్లారిటీ ఇచ్చేసారు. టాక్సిక్ కేవలం పెద్ద వాళ్ళకి మాత్రమే అని క్లారిటీ ఇచ్చేసారు. సో చిన్న పిల్లలు, సెన్సిటివ్ వ్యక్తులు దూరంగానే ఉండాలని చెప్పాలి. ఆల్రెడీ వైలెన్స్, కొన్ని బోల్డ్ సీన్స్‌పట్ల సోషల్ మీడియాలో రచ్చ నడుస్తున్న సంగతి తెలిసిందే. సో ఇపుడు నేరుగా నిర్మాతనుంచే టాక్సిక్ విషయంలో క్లారిటీ వచ్చింది కాబట్టి ఆడియెన్స్ ఎలాంటి ఫలితం అందిస్తారో చూడాలి. ఇక ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా.. ఆగష్టు 27న సినిమా థియేటర్లకు రానుంది.

## హాట్ స్టార్!




## బాలయ్య ఆరోగ్యంపై బులిటెన్

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం తన కెరీర్ 111వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. హిట్ దర్శకుడు గోపీచంద్ మలినేనితో స్టార్ట్ చేసిన సాలిడ్ యాక్షన్ డ్రామా షూట్‌లో బాలయ్య గాయపడ్డారనే వార్త ఒకింత షాకింగ్‌గా మారింది. దీనితో అభిమానులు, సినీ ప్రముఖులు కూడా బాలయ్య త్వరగా కోలుకోవాలని ఆశించారు. ఇదిలా ఉండగా బాలయ్య అడ్మిట్ అయిన హాస్పటల్ ఏఐజీ సంస్థ లేటెస్ట్‌గా బులెటిన్ విడుదల చేసి ప్రస్తుతానికి క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి బాలయ్య ఎడమ కాలి మోకాలి కండరం వద్ద అయిన గాయంపైనే కీళ్ల శస్త్రచికిత్స వైద్యులుతో విచారణ జరుగుతుందని.. మొత్తంగా బాలయ్య ఆరోగ్యం నిలకడగానే ఉందని, ప్రస్తుతం మెడికల్ అబ్జర్వేషన్‌లోనే కొనసాగుతున్నారని ట్రీట్మెంట్ ప్లాన్‌ని ప్రస్తుతం కొనసాగుతున్న అబ్జర్వేషన్ పిమ్మట తెలుపుతామని తెలిపారు. సో బాలయ్య అభిమానులు ఎటువంటి కంగారు పడాల్సిన పని లేదు.



## ఆ జోడీ.. రిపీట్

అల్లు అర్జున్ హీరోగా సెన్సేషనల్ లైనప్‌తో బిజీగా ఉన్నాడు. ఇండియన్ సినిమా దగ్గర మోస్ట్ బిజీగా ఉన్న పాన్ ఇండియా హీరోస్‌లో బన్నీయే. ఆ లైనప్‌లో దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో ప్లాన్ చేస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కూడా ఒకటి. అనౌన్సమెంట్‌తోనే మంచి హైప్‌ని జెనరేట్ చేసిన ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుందా? అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


అయితే లేటెస్ట్‌గా సినిమా హీరోయిన్‌గా స్టార్ బ్యూటీ పూజా హెగ్డే లాక్ అయినట్టుగా కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే మాత్రం 'అల వైకుంఠపురములో' జోడీ రిపీట్ అయినట్టే అని చెప్పాలి. ఆల్రెడీ వీరికి ఇండస్ట్రీ హిట్ ట్రాక్ రికార్డు ఉంది. లోకేష్ కూడా పూజా హెగ్డేతో 'కూలీ'లో మంచి ట్రీట్ ఇచ్చాడు. సో ఈ ముగ్గురు కలయికలో ప్రాజెక్ట్ అంటే మరింత ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఇక దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.



## అందుకే.. బాలీవుడ్‌ను వదిలేశా

ప్రియాంకా చోప్రా తనదైన నటనతో హిందీ చిత్రపరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, కెరీర్ ఉన్నత దశలో ఉన్నప్పుడు ఆమె బాలీవుడ్‌ను ఎందుకు వదిలేశారన్న ప్రశ్న చాలా కాలంగా వినిపిస్తోంది. ఈ విషయంపై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. "కొందరిని మెప్పించనందుకు.. వారు చెప్పినట్టు చేయనందుకు నా సినిమా అవకాశాలు మరొకరికి ఇచ్చారు. ఇతరులు రాజీ పడినట్టుగా.. వాళ్లకు అనుకూలంగా మారేందుకు నేను ఇష్టపడలేదు. ఈ విషయం గురించి నేను ఎక్కువగా మాట్లాడను. కొందరు అగ్ర హీరోలు నన్ను ఉద్దేశపూర్వకంగా సినిమాల నుంచి తప్పించారు. 2007లో 'సలామ్-ఎ-ఇష్క్' షూటింగ్ సమయంలో నేను మరో సినిమాలో నటించాల్సి ఉంది. ఆ చిత్ర హీరో ఒకరోజు నా సెట్‌కు వచ్చారు. తర్వాత నెలలోనే మా సినిమా షూటింగ్ ప్రారంభం కానుండటంతో.. నాకు మద్దతుగా వచ్చారని అనుకున్నా. కానీ, ఆయన ఊహించని మాట చెప్పారు. 'దర్శకుడు పొరపాటున ఈ సినిమా నీకు ఇచ్చారు.

నిజానికి ఈ పాత్ర మరో హీరోయిన్ చేయాల్సింది. మనం భవిష్యత్తులో మరో సినిమా చేద్దాం. ఈ విషయం నీకు స్వయంగా చెబుదామనే వచ్చా' అని చెప్పారు. ఇలా ఒకసారి కాదు.. చాలాసార్లు జరిగింది. ఆ పరిస్థితుల్లో నా కెరీర్ గురించి ఆలోచించాను. నా నటనపైనే పూర్తి దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాను. నా కష్టమే నా కెరీర్‌ను నిలబెట్టి, మరిన్ని అవకాశాలు తెచ్చిపెట్టింది" అని ప్రియాంక గుర్తుచేసుకున్నారు. ఇక, మహేశ్ బాబు కథానాయకుడిగా, రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'వారణాసి'లో ప్రియాంక కనిపించనుంది. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా, వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది.



## గ్రోవర్ పాత్రనుంచి తప్పుకున్న ఆమిర్

పారిశ్రామికవేత్త అష్నీర్ గ్రోవర్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ నుంచి బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ వైదొలిగినట్టు తెలుస్తోంది. దర్శకుడు రాహుల్ మోదీతో తలెత్తిన విభేదాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. స్టార్టప్‌ల ప్రపంచంపై ఉన్న ఆసక్తితో అమిర్ ఈ సినిమాను ఓకే చేశారని.. స్క్రిప్ట్ వర్క్‌లో కూడా పాల్గొన్నారని సమాచారం. కథ విషయంలో దర్శకుడితో విభేదాలు రావడంతో దీనినుంచి వైదొలగాలని



నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. అయితే, దీనిపై ఆమిర్ ఇప్పటివరకూ స్పందించలేదు. మరోవైపు, ఆమిర్ వైదొలగడంతో మరో హీరోను ఎంపిక చేసేందుకు మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బాలీవుడ్‌లోని కొందరు హీరోలతోనూ చర్చలు జరిపారని సమాచారం. త్వరలోనే కొత్త హీరోను అధికారికంగా ప్రకటిస్తారని టాక్. ఈ బయోపిక్‌లో 'భారత్ పే' సహ వ్యవస్థాకుడిగా అష్నీర్ ప్రయాణాన్ని, పాపులర్ రియాలిటీ టీవీ షో 'షార్క్ ట్యాంక్ ఇండియా' మొదటి సీజన్ న్యాయనిర్ణేతగా ఆయకు వచ్చిన గుర్తింపును చూపనున్నారు. అష్నీర్ భార్య మాధురి జైన్ పాత్రలో శ్రద్ధా కపూర్ నటించనున్నట్టు తెలుస్తోంది.

## ఆ కథనాలు.. పొలిటికల్ స్టంట్

విజయ్ నటించిన 'జన నాయగన్' విడుదలకు ముందే నెట్టింట లీకైన విషయం తెలిసిందే. దీన్ని ఉద్దేశపూర్వకంగా లీక్ చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి. తాజాగా వాటిపై దర్శకుడు హెచ్ వినోద్ స్పందించారు. తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో విజయ్ గెలవడం కోసం సినిమాను లీక్ చేశారనడంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేస్తున్నారని మండిపడ్డారు. జులై 23న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో దర్శకుడు మీడియాతో మాట్లాడారు. భారీ బడ్జెట్‌తో నిర్మించిన సినిమాను ఎవరైనా కావాలని లీక్ చేస్తారా? అని ప్రశ్నించారు. కావాలని చేస్తే.. అధికారులకు కొన్ని గంటలు లేదా రోజుల్లోనే విషయం తెలిసిపోతుంద న్నారు. "రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు ఇప్పటికే అర్థం చేసుకున్నారు. విజయ్ అప్పుడే స్పందించి ఉంటే, దానిపై కూడా విమర్శలు వచ్చేవి. లీక్స్‌పై నిర్మాతల ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు" అని తెలిపారు. సినిమా విడుదల ఆలస్యం కావడంపై వినోద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆరునెలలు ఎంతో కష్టంగా గడిచిందన్నారు. శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుందన్న నమ్మకం ఉందన్నారు.



## ముచ్చటగా.. మూడో ఛాన్స్!

ఇండియన్ సినిమా దగ్గర మంచి మార్కెట్ సొంతం చేసుకున్న అగ్ర తారల్లో పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ కూడా ఒకరు. అయితే ప్రభాస్ హీరోగా నటిస్తున్న చిత్రాల్లో దర్శకుడు సందీప్ రెడ్డి వంగ కలయికలో చేస్తున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ స్పిరిట్ ఒకటి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కొనసాగుతూ ఉండగా దీనికి సంబంధించి బిజినెస్‌పై ఇంట్రెస్టింగ్ బజ్ వినిపిస్తుంది. ఈ సినిమా కన్నడ డబ్బింగ్ రైట్స్‌ని పీపుల్ మీడియా, ఆసియన్ సంస్థకి అమ్మినట్టు కన్ఫర్మ్ అయ్యింది. అయితే పీపుల్ మీడియా వారికి హక్కులు ఇవ్వడం వెనుక ప్రభాస్ ప్రధాన కారణం అన్నట్టు టాక్ నడుస్తుంది.

ఆదిపురుష్ మూలాన వచ్చిన నష్టాలకి భరోసాగా రాజా సాబ్ చేసాడు. కానీ అది కూడా అనుకున్న రేంజ్‌లో పెర్ఫామ్ చేయనుందున మరొక్క అవకాశాన్ని ఈ రూపంలో ఇచ్చినట్టు సినీ వర్గాల్లో టాక్ నడుస్తుంది. సో ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది తెలియాల్సి ఉంది. అయితే ఈసారి మాత్రం ముందు రెండు సినిమాల్లా మిస్ ఫైర్ అవ్వడం జరగదనే చెప్పొచ్చు. మెయిన్‌గా ప్రభాస్‌తో పాటుగా దర్శకుడు సందీప్ వంగ ఫ్యాక్టర్ ఈ చిత్రానికి బాగా ప్లస్ అవుతుండడంతో అంచనాలు గట్టిగానే ఉన్నాయి. సో ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర వండర్స్ సెట్ చేయడం ఖాయం. సో ఇప్పుడైతే ముందులా తప్పులు జరిగే అవకాశాలు చాలా తక్కువే.